# 3. శ్రద్ధ

నాలుగింటికి లెక్చర్ వుందన్న రిమైండర్ కంప్యూటర్‌లో కనబడ్డగానే, చేస్తున్న పని ఆపి, అన్నీ ప్రక్కకి సర్ది లేచాను.

ప్రతి గురువారం ఏదో ఒక విషయం మీద ప్రముఖులతో ఉపన్యాసాలు యిప్పిస్తుంది కంపెనీ. సంస్కృతిమీద సైన్స్ ప్రభావమో... సైన్స్‌మీద సంస్కృతి ప్రభావమో... టైటిల్ సరిగా గుర్తులేదు కానీ అలాంటిదే ఏదో విషయంమీద ఉపన్యాసం యివాళ.

కాన్ఫరెన్స్ హాల్లోకి అడుగుపెడుతూనే వులిక్కి పడ్డాను. ఎప్పుడూ సగం కూడా నిండని హాలు యివాళ క్రిక్కిరిసిపోయింది. తలుపుదగ్గరే నిలబడి చోటుకోసం వెతుకుతుంటే... దూరం నుంచి వందన చేయి వూపింది.

తన ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ "ఇంతమంది వచ్చారేమిటి? సంస్కృతి మీద ఆసక్తా! సైన్స్‌మీదా!" అన్నాను. వందన మందహాసం చేసింది.



ఉపన్యాసం మొదలయింది. గంటన్నరసేపు అనర్గళంగా మాట్లాడాడు వక్త. మన సంస్కృతిలో వున్న గొప్పదనాన్నీ... అందులో వున్న సైన్స్‌నీ చెప్పాడు. ఒక ప్రక్క అనుష్టుప్ ఛందస్సు గురించీ మాట్లాడాడు. మరో ప్రక్క యోగా, ప్రాణాయామం లాంటి వాటి గురించీ అక్కడున్న వాళ్ళకి తెలియని ఎన్నో విషయాలు చెప్పాడు. చివరికి ఉపన్యాసం ముగిస్తూ సంప్రదాయాన్ని వదలిపెట్టనివారు ఆరోగ్యంగా వుంటారనీ, బి.పిలు గుండె జబ్బులు లేకుండా నూరేళ్ళు హాయిగా బ్రతుకుతారనీ చెప్పాడు.

ప్రశ్నలేమన్నావుంటే అడగమన్నారు. వందన లేచి నిలబడింది. "మీ ఉపన్యాసం చాలా బాగుందండీ. కానీ నాదో చిన్న కంప్లైంట్' అంది.

"ప్రతి పనికీ ప్రయోజనమేమిటో చెప్పి ఆకర్షించ

డం ఆధునికమైన పద్ధతి కదా! సంస్కృతీ సంప్రదాయాల గురించి ఉపన్యసించేవారు కూడా అదే ప్రయత్నం ఎందుకు చేస్తారు?" అంది.

ఆయనది తెలివో, అతితెలివో కానీ... "అవును. చాలామంది అలాగే చేస్తున్నారు. కానీ అది కరెక్ట్ కాదనిపిస్తే శ్రోతలు పట్టించుకోకూడదు" అన్నాడు. ఆ ఆరోపణ తన గురించి కూడా నన్న విషయం అర్థంకానట్లు.

మరొకరెవరో ప్రశ్న అడిగేందుకు లేవడంతో వందనకి యింకేమనడానికీ అవకాశం దొరకలేదు. పావుగంట తర్వాత యిద్దరం బయటికి వచ్చాం.

ఈవినింగ్ స్నాక్స్ టైమ్ కావడంతో అందరూ గుంపులు గుంపులుగా క్యాంటీన్ వైపు వెళ్తున్నారు. మేమూ అటే నడిచాం. ప్రదీప్, దీపక్ కలిశారు. అందరం స్నాక్స్ తీసుకుని ఒక టేబిల్ దగ్గరికి చేరాం.

"లెక్చర్‌కి వెళ్ళి వస్తున్నారా! ఎలా వుంది?" అని అడిగాడు ప్రదీప్.

వందన మొత్తం వివరించి "సాంప్రదాయవాదులు యిదివరకు 'ఈ విషయం యింతే, ఇదిలాగే చేయాలి' అని ఖచ్చితంగా రూల్‌లా చెప్పేవాళ్ళు. కానీ యిప్పటి వక్తలు అలా చెప్తే అందరికీ నచ్చదని కాబోలు, సైంటిఫిక్‌గా ఆలోచించినా అది మంచిదేననీ.. దానివల్ల చాలా ప్రయోజనాలుంటాయనీ చెప్పాలని ట్రై చేస్తున్నారు. నాకెందుకో అది నచ్చడం లేదు" అంది.

"ఎందుకు! అందులో నచ్చకపోవడానికి ఏముంది?" అన్నాడు ప్రదీప్.

"సాంప్రదాయికమైన జీవనవిధానం వున్నంత మాత్రాన రోగాలు, కష్టాలు వచ్చే అవకాశమే లేదని ఖచ్చితంగా చెప్పలేం కదా!" అంది వందన.

"అవును. గొప్ప గొప్ప యోగులకే క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చాయి కదా!" అన్నాడు దీపక్.

"అయితే సంప్రదాయంవల్ల లాభం లేదంటావా!" అన్నాడు ప్రదీప్.

"అలా అనడం లేదు. లాభంతో ప్రమేయం లేకుండా సంప్రదాయాన్ని పాటించాలి అంటున్నాను. లాభం వుంటేనే చేసేది బిజినెస్."

"లాభంలేని పని చేయడమెందుకు! బిజినెస్ అయినా మరేదైనా!" అన్నాడు ప్రదీప్.

ఎలా చెప్పాలో అర్థం కానట్లు వందన భుజాలు కుదించింది.

దీపక్ నవ్వాడు. "బిజినెస్ డబ్బుల కోసం. సంప్రదాయం పుణ్యంకోసం. ఆ రెండింటినీ కలపకు" అన్నాడు.

"ఒక మాక్రో వ్యూతో ఏర్పరిచిన నియమాలకి లౌకికమైన లాభాలు ప్రలోభంగా చూపడం వందనకి నచ్చడం లేదనుకుంటా" అన్నాను నేను.

"ఎగ్జాక్ట్లీ" అంది వందన, నేను తన భావాన్ని సరిగ్గా చెప్పినందుకు ఆనందిస్తూ.

"నియమాలు లాభాలకోసం కాదు. నియమబద్ధమైన జీవితాన్ని గడిపినా కూడా కష్టాలొస్తే ప్రారబ్దం అనుకోవాలి కానీ నియమాలని వదిలేయకూడదు" అంది.

"బాగుంది. మంచి జరిగితే నియమం గొప్పదనం. చెడు జరిగితే ప్రారబ్దం. అదేం లాజిక్!" అపహాస్యం చేశాడు ప్రదీప్.

వందన చురుగ్గా చూసి "అంతకన్నా గొప్ప లాజిక్ ఏమిటో నువ్వు చెప్పు" అంది.

"ప్రారబ్దం అనేది కొందరే నమ్మే సిద్ధాంతం. నమ్మేవాళ్ళకయినా వాళ్ళ ప్రారబ్ధం ఏమిటో వాళ్ళకి తెలీదు కదా!" అన్నాడు ప్రదీప్.

"ఆ మాటకొస్తే మన లాభం ఏమిటో కూడా మనకి సరిగా తెలీదు కదా!" అన్నాను నేను.

అందరూ ఒక్క క్షణం నిశ్శబ్దంగా అయిపోయారు.

"నిజం. ఒక్కొక్కసారి చాలా లాభమనుకుని ఓ పనిచేసి ఆ తర్వాత నిజానికి అది లాభం కాదనీ.. అలా చేసుండాల్సింది కాదనీ గ్రహించి బాధపడే సందర్భాలు ఎన్నో వుంటాయి" అన్నాడు దీపక్.

అందరం లేచి కాఫీలు తెచ్చుకుని మళ్ళీ టేబిల్ దగ్గరికి చేరాం.

"నువ్వు కరెక్ట్‌గా చెప్పావు శారదా!" అంది వందన. "శాస్త్రం చెప్పిన నియమాలని ఎందుకు అని ప్రశ్నించేంత తెలివికానీ.. లాభనష్టాలు బేరీజు వేసే శక్తి కానీ మనకి వుండదు. ఆ నియమాలని పాటించడం మాత్రమే మనం చేయగలిగింది."

"బాగుంది. ఎవరో చెప్పిన నియమాలని ఫాలో అయిపోవడానికి యిప్పటివాళ్ళు ఏమీ తెలియని అమాయకులు కాదు కదా! బాగా చదువుకున్న వాళ్ళు, పరీక్షించకుండా దేన్నీ ఒప్పుకోలేరు" అన్నాడు ప్రదీప్.

"ప్రశ్నించడం యిప్పటివాళ్ళు కనిపెట్టిన టెక్నిక్ అని నీకెవరు చెప్పారోయ్! మన గ్రంథాలన్నీ ప్రశ్నోత్తరాల ఫార్మాట్‌లోనే కదా వుంటాయి! భాగవతం తెరిస్తే పరీక్షిత్తు నాలుగు పేజీల ప్రశ్నలడుగుతాడు. శుకమహర్షి కాబోలు వాటికి వరుసగా సమాధానాలు

చెప్తాడు. భగవద్గీతా అంతే" దీపక్ హాస్యంగా అన్న తీరుకి ప్రదీప్‌తో సహా అందరం నవ్వేశాం.

"వ్రత కథలూ అంతే" అని నేను యాడ్ చేశాను.

"మరి ఆ వ్రతకథల్లో కూడా లాభాలే కదా చెప్తారు! మా అమ్మ చదువుతూ వుండేది వరలక్ష్మీ వ్రతం చేయగానే అందరికీ ఆభరణాలూ, ఐశ్వర్యాలూ వచ్చేస్తాయిట" అన్నాడు ప్రదీప్.

వందన నా మొహంలోకి చూసింది. నేను నవ్వాను. "అలా కాదు ప్రదీప్. వందన బాధ నీకర్థం కాలేదు. పెద్దవాళ్ళు మూడు రకాల కర్మల గురించి చెప్తుంటారు. నిత్యకర్మలు, నైమిత్తికకర్మలు, కామ్యకర్మలు అని. వ్రతాలూ అవీ కామ్యకర్మలు.. ఏదన్నా ఆశించి చేసేవి కాబట్టి అక్కడ లాభనష్టాల గురించి మాట్లాడటం వేరు. కానీ నిత్యకర్మలు... అంటే రోజూ తప్పకుండా చేయాల్సిన వాటికీ... నైమిత్తిక కర్మలు అంటే కొన్ని ప్రత్యేక సందర్భాలలో చేయాల్సిన విధులు... వాటికీ... ఛాయిస్ లేదు. లాభనష్టాల ప్రసక్తి లేదు. చేసి తీరాలి"

నా మాటలు వింటూ వందన తల వూపింది. "అవును" అంది.

"అమ్మబాబోయ్. ఇన్ని సిద్ధాంతాలా! ఇష్టమైన పనులు చేసుకుంటూ పోవడమే కానీ యింత ఆలోచించను నేనెప్పుడూ" అన్నాడు ప్రదీప్.

"వందనకి తప్పదుకదా! తన వుద్యోగం అలాంటిది" అన్నాను నేను నవ్వుతూ.

వందన ప్రాసెస్ గ్రూప్‌లో పనిచేస్తుంది. ఆర్గనైజేషన్‌లో అందరూ అనుసరించాల్సిన పద్ధతులని నిర్వచించడమూ... అవి అందరూ ఆచరించేలా చూడడమూ... అదీ తన వుద్యోగం. నేను వందన ఉద్యోగం సంగతి ఎత్తగానే ప్రదీప్, దీపక్ కూడా నవ్వారు.

"ఆలోచించు.. ఆలోచించు. మా అందరినీ ఎలా హింసించాలో యింకా బాగా ఆలోచించు" అంటూ లేచి నిలుచున్నాడు ప్రదీప్.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయినా మేము అలాగే కూర్చుండిపోయాం. సూర్యాస్తమయం అవుతోంది. ఆరో అంతస్థులో వుండే మా క్యాంటీన్ గ్లాస్ విండోస్‌లో నుంచి సూర్యాస్తమయాన్ని చూడడం నాకు చాలా యిష్టం.

నేను బయటికి చూస్తూ రెండు నిమిషాలు అలాగే వుండిపోయాను. ప్రక్కకి తిరిగి చూస్తే వందన తలవంచుకుని కాఫీ కప్పుని చేత్తో తిప్పుతూ ఆలోచిస్తోంది.

"ఏంటి వందనా!" అన్నాను.

"హూ" అంటూ నిట్టూర్చింది. "నువ్వు చెప్పిన విషయమే ఆలోచిస్తున్నాను శారదా!

తప్పకుండా చేయాల్సిన పనులంటూ కొన్నిటిని నిర్దేశించుకుని వాటిని క్రమం తప్పకుండా అందరూ శ్రద్ధగా పాటించడం. అదంతా అసలు ఎలా సాధ్యం అయిందా అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఎందుకని అలా చేయలేకపోతున్నాం! కారణమేమిటి?"

"స్వార్థం పెరగడం. విశ్వాసం సడలడం" అన్నాను.

నేను చెప్పిన రెండు కారణాలూ విని వందన తలపంకించింది "అవును. ఈ పద్ధతి అందరికీ మంచిది కాబట్టి యిలా చేద్దామంటే ఎవరూ లక్ష్యపెట్టరు. వ్యవస్థ కోసం వ్యక్తిగత ప్రాధాన్యాలు ప్రక్కన పెట్టడం ఎవరికీ యిష్టం వుండదు. పోనీ యిలా చేస్తే పుణ్యం.. చేయకపోతే పాపం లాంటి నమ్మకాలూ లేవు. ఇంకెలా నిలబడతాయి వ్యవస్థలు!" అంధి నిర్వేదంగా చూస్తూ.

ఒక్క క్షణం ఆగి, "నా వుద్యోగం మూలంగానే నేనీ విషయాలకి యింతగా వర్రీ అవుతున్నానంటావా!" అంది.

నేను చిన్నగా నవ్వాను. "లేదులే. నువ్వు కొంచెం ఎక్కువగా ఆలోచిస్తున్న మాట నిజమే కానీ... యిది మిగతావాళ్ళందరూ పట్టించుకోకుండా వదిలేయాల్సిన విషయమేమీ కాదు. 'ఏ నియమానికీ లోబడము. ప్రతీదీ మేమే పరీక్షించి నిర్ణయించుకుంటాం' అనేవాళ్ళని చూసి నేనూ చాలాసార్లు ఆలోచనలో పడుతూంటాను. ఆ ధోరణివల్ల మిగతా వారికంటే గొప్పగా వాళ్ళు సాధించినదేమీ కనబడలేదు నాకెపుడూ" అన్నాను.

"బాగా చెప్పావు" అంది వందన. "ఎడాపెడా బ్రతికేసి వాళ్ళు సాధించేదేమీ వుండదు. పద్ధతిగా బ్రతికేవాళ్ళని చూసి ఎంత మూఢత్వం? ఎంత చాదస్తం! అంటూ వుంటారు కానీ ఆ మూఢత్వం, చాదస్తం లేనందువల్ల వాళ్ళు ఎక్స్‌ట్రాగా ఉద్ధరించేదేమీ వుండదు"

వందన అన్న తీరుకి నాకు ఫక్కున నవ్వొచ్చింది.

"తప్పు శాస్త్రంలోనూ, సంప్రదాయంలోనూ లేదు శారదా! మనుషుల ఆలోచనలోనే వుంది. మొదట్లో నేను వైదికమైన ఆచారాలనే జనం విమర్శిస్తారేమో అనుకునేదాన్ని. కానీ ఆర్గనైజేషనల్ పాలసీస్‌ని... మనం వ్రాసుకున్న వాటిని... నిజంగా లోపం వుంటే మార్చుకోవడానికి వీలయినవాటిని కూడా ఫాలో అవడానికి జనాలు యిబ్బంది పడడం చూశాక అర్థమయింది. ఇప్పటివాళ్ళకి ఏ రూల్సూ సరిపడవని."

"రూల్స్ వల్ల క్రియేటివిటీ దెబ్బతింటుందని చాలామంది భావన" సాలోచనగా అన్నాను.

"నా మొహం క్రియేటివిటీ" అంది వందన. "అరాచకంగా బ్రతకడానికీ, సృజనాత్మకతకీ ఏం సంబంధం చెప్పు! నిజం చెప్పాలంటే... రూల్స్‌ని పాటిస్తూ

పనిచేసుకునేవాళ్ళే బోలెడంత టైమ్ సేవ్ చేసుకుని... వాళ్ళ ప్రాజెక్ట్స్‌లో యింకా ఎన్నో యింప్రూవ్‌మెంట్స్ చూపిస్తారు. 'ప్రాసెస్ వల్ల ఏం వుపయోగం లేదు. ఏ పనైనా ఎలా అయినా చేయచ్చు' అని ప్రచారం చేసేవాళ్ళే... ఏ రోజు చూసినా 'నా ప్రాజెక్ట్ తగలబడిపోతోంది' అంటూ హడావుడిగా తిరుగుతుంటారు."

"నిజం" అన్నాను నేను. "నాలుగు రోజుల క్రితం టి.వి.లో షణ్ముఖశర్మగారి ప్రవచనం విన్నాను. ఆయన చెప్పారు. 'నియమాలెక్కడ వున్నాయో సైన్సు అక్కడ వుంది. గుర్తుపెట్టుకోండి. ఏ నీళ్ళు బడితే అవి తాగచ్చు. ఫరవాలేదు. అని చెప్పడానికి సైన్సు అక్కర్లేదు. కాచి వడబోసుకుని త్రాగండి అని చెప్పడానికి సైన్సు కావాలి. కాబట్టి ఎవరైనా ఎక్కువ నియమాలు చెప్తే వాళ్ళకి ఎక్కువ సైన్స్ తెలుసని అర్థం చేసుకోవాలి' అన్నారు. నిజమే కదా అనిపించింది నాకు."

"భలే చెప్పారు కదా!" అంది వందన.

ఇద్దరం లేచి లిఫ్ట్‌లో క్రిందకి వచ్చాం. ఆఫీస్ బయటికి వస్తూండగా అన్నాను. "మొన్నొకరోజు శ్రీరామ్ ఏదో పజిల్ పూర్తిచేసి సంతోషంగా నా దగ్గరికి పరుగెత్తుకు వచ్చాడు. వచ్చి ఏమన్నాడో తెల్సా!"

"ఏమన్నాడు" వందన ఆసక్తిగా అడిగింది.

"అమ్మా! ఈ పజిల్‌కి చూడు ఎన్ని రూల్స్ వున్నాయో! నేను ముందు అవన్నీ చదివి అమ్మో! ఈ గేమ్ చాలా కష్టంగా వుంటుందేమో అనుకున్నా. కానీ ఆ రూల్స్ వల్లే గేమ్ చాలా ఈజీ అయిపోయింది అని."

"ఎన్నేళ్ళు వాడికిప్పుడు!" వందన ఆశ్చర్యంగా అడిగింది.

"మొన్ననే పది వెళ్ళి పదకొండు వచ్చింది."

"చిన్నవాడు కాబట్టి సత్యం గ్రహించాడు" అంది వందన. "అసలు యిలాంటి విషయాల్లో చిన్నప్పటి నుంచే తప్పుదారి పట్టిస్తున్నారు శారదా! ఏ పనైనా కారణం తెలుసుకుని కానీ చేయరాదనీ.. ప్రతి విషయాన్నీ ఎందుకు! అని ప్రశ్నించాలనీ... యివే యిప్పటి పిల్లలు నేర్చుకుంటూన్న పాఠాలు" వందన కంఠంలో చిరాకు ధ్వనించింది.

"నిజమే... మా చిన్నవాడు మాధవ్ కొంచెం అలాంటి ధోరణే ప్రదర్శిస్తాడు. ఏదన్నా యిది మంచిది, అది కాదు... అని చెప్పానంటే 'ప్రూవ్ చెయ్యి' అంటాడు."

నా మాటలకి వందన నవ్వింది. "అమ్మకి అన్నీ తెలుసు అన్న నమ్మకం ఎక్కువన్నమాట వాడికి" అంది.

అక్కడితో సంభాషణ ఆపి యిద్దరం యింటి దారి పట్టాం. ఆటోలో వస్తూంటే

అనిపించింది "నిజమే. పిల్లలకి ప్రశ్నలడగడం మాత్రమే నేర్పుతున్నాం. సమాధానపడడం నేర్పడం లేదు. నిప్పుతో సవాలక్ష వుపయోగాలు వుండవచ్చు. కానీ నిప్పుని రగల్చడం మాత్రమే నేర్పితే సరిపోదు. ఏం చేస్తే నిప్పు బాగా మండుతుందో నేర్పినట్లే.. నిప్పుని చల్లార్చడమూ నేర్పాలి. నిప్పుమీద నీరు జల్లడమూ నేర్పాలి. నిజానికి మొదటిదాన్ని మనం ప్రత్యేకించి నేర్పకపోయినా, అవసరమే వాళ్ళకి దాన్ని నేర్పుతుంది. కానీ రెండోదాన్ని మాత్రం మనం పద్ధతిగా నేర్పి తీరాలి."

ఇల్లు చేరి పనిలోకి దిగగానే ఆలోచనలు ప్రక్కకి తప్పుకున్నాయి. రాత్రి భోజనాల కార్యక్రమం పూర్తిచేసి బెడ్‌రూమ్‌లోకి వచ్చేసరికి మాధవ్ మంచానికి అడ్డంగా పడుకుని వున్నాడు.

"అలా పడుకోకూడదు మాధవ్. లేచి సరిగా పడుకో" అన్నాను.

"ఏమవుతుందమ్మా!" అన్నాడు వాడు గారాలుపోతూ.

"నార్త్ వైపు తలపెట్టి పడుకోకూడదు" అని వాడితో చెప్పి "కదమ్మా" అన్నాడు శ్రీరామ్ నా వైపు తిరిగి. నేను తల వూపాను.

"ఎందుకు!" అన్నాడు మాధవ్.

నేను నోరు తెరిచి సమాధానం చెప్పబోయి ఆగాను. తల అడ్డంగా వూపుతూ "తెలీదు" అన్నాను. "అది పెద్దవాళ్ళు పెట్టిన రూల్."

"నాకు తెలుసు నార్త్ వైపు ఎందుకు తలపెట్టకూడదో! చిల్డ్రన్స్ డైజెస్ట్‌లో చదివాను" అన్నాడు శ్రీరామ్.

మాధవ్ ఆశ్చర్యంగా నావైపు తిరిగి "నీకిప్పటివరకూ తెలీదా!" అన్నాడు.

"తెలీదు. ఎందుకు చేయకూడదో తెలీదు కానీ అలా చేయకూడదని తెలుసు. అందుకని నేనెప్పుడూ అలా చేయను" అన్నాను.

ఒక్కక్షణం నా వైపు ఏదో అద్భుతాన్ని చూసినట్లు చూశాడు మాధవ్. ఆ తర్వాత మెల్లగా వాడి దుప్పటి పట్టుకుని లేచి సరిగా పడుకున్నాడు. అరక్షణంలో నిద్రలోకి జారాడు.

ప్రశాంతంగా నిద్రపోతున్న పిల్లలిద్దరినీ చూస్తూ అనుకున్నాను.

"అడిగిన ప్రతీదానికీ కారణం చెప్పి... విజ్ఞానాన్ని అందించడమే కాదు.. ఇకమీదట పిల్లలకి 'శ్రద్ధ'ని నేర్పడం మీద కూడా శ్రద్ధ పెట్టాలి" అని.

**– ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక**

*16 జూన్ 2011*